
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 22.51 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 22.519 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 721 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,460
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,624
సవర (8 గ్రాములు)	రూ.44,992

గరిష్టం/కనిష్టం
35.6 /28.9

వాతావరణం

వాతావరణంలో తేమ 50 శాతంగా ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం గురువారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పింఛన్ కానుక పంపిణీ



శాంతినగర్‌కు చెందిన షంషాద్‌కు నగదును అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసాద్, అడ్మిన్ దీపిక

నెల్లూరు (పొగతోట): జిల్లాలో నూతనంగా 15,167 మందికి వైఎస్సార్ పింఛన్ కానుకను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో గతంలో 3,03,501 పింఛన్ కానుకలు ఉండగా, ఈ సంఖ్య 3,18,668కు చేరింది. ఈ క్రమంలో 7084 మందికి పింఛన్ నగదును బుధవారం అందజేశారు.

నాణ్యమైన విద్యనందించాలి



కావలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి పేర్కొన్నారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. నాడు – నేడు ద్వారా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను అభివృద్ధి చేశారని చెప్పారు. ఇంగ్లిష్ విద్యను అమలు చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. అనంతరం పాఠశాలలో వసతులు, నాడు – నేడు పనులను పరిశీలించారు. జీసీడీఓ మమత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

మనుబోలు: మండలంలోని వీరంపల్లి పంచాయతీ పరిధిలో గల లింగారెడ్డిపల్లిలో గిరిజనుల ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ నాగరాజు ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామానికి 23 ఇళ్లు మంజూరు కాగా, కొన్నింటిని బేస్‌మెంట్ వరకు పూర్తి చేశారన్నారు. మిగిలిన గృహాలను నిర్మించాల్సి ఉందని, ఈ విషయంలో జాప్యం తగదని కాంట్రాక్టర్‌కు సూచించారు. గిరిజనులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందజేసిన రూ.15 వేలను వినియోగించాలని తెలిపారు. హౌసింగ్ ఏఈ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ఆర్‌ఐలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు (దర్గామిట్ట): ఉమ్మడి నెల్లూరు జిల్లా రెవెన్యూ శాఖలో 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఆర్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ప్రకటన వెలువడింది. బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలీని కొండాపురం ఆర్‌ఐగా, బోగోలు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇమ్రాన్‌ను కలిగిరి ఆర్‌ఐగా, తిరుపతి కలెక్టరేట్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రియాంకను సూళ్లూరుపేట ఆర్‌ఐగా, నెల్లూరు కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ ప్రియాంకను డీఎస్‌ఓ కార్యాలయ ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్‌గా, కావలి ఆర్డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జ్యోప్రభదీప్‌ను అల్లూరు ఆర్‌ఐగా, నెల్లూరు కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్ సుధీర్‌ను మనుబోలు ఆర్‌ఐగా, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటద్వారకానాథ్‌ను టీపీగూడూరు ఆర్‌ఐగా, తిరుపతి కలెక్టరేట్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు యశ్వనాథ కుమార్‌ను వెంకటాచలం ఆర్‌ఐగా, సాయికిరణ్‌ను వరికుంటపాడు ఆర్‌ఐగా, గూడూరు ఆర్డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వందనను గూడూరు ఆర్‌ఐగా, ఏఎస్‌పేట తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రవితేజను అదే మండలానికి ఆర్‌ఐగా నియమించారు.

యంత్ర భాగ్యం.. మంత్రముగ్ధం



సన్న, చిన్నకారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ.. కర్షకుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. వీటిలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ఒకటి. దీని ద్వారా రైతు గ్రూపునకు (ఐదు లేదా ఆరుగురు) ట్రాక్టర్ ఖరీదులో 40 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దీంతో వీటిని సేద్యంలో వినియోగించుకొని మంచి దిగుబడులు పొంది లాభాల బాటలో అన్నదాతలు పయనిస్తున్నారు.

- ఆదుకుంటున్న వైఎస్సార్ యంత్ర సేవా పథకం
- రైతు గ్రూపులకు సబ్సిడీపై ట్రాక్టర్లు
- ఆర్బీకేల వారీగా అర్హులకు అందజేత
- ఇప్పటికే రెండు విడతలుగా మేళాలు



మేళాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు (ఫైల్)

సాక్షి, నెల్లూరు డెస్క్: జిల్లాలో వ్యవసాయంలో ట్రాక్టర్ల వినియోగం ఏటా పెరుగుతోంది. సేద్యంలో విత్తు నాటిన మొదలు.. పంట చేతికొచ్చేంత వరకు అన్ని దశల్లో ట్రాక్టర్ల అవసరం ఎంతగానో ఉంది. అయితే వీటి ధర అధికంగా ఉండటంతో సన్న, చిన్నకారు రైతులు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వీటిని సబ్సిడీపై అందించేందుకు వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతి ఆర్బీకే పరిధిలో అన్నదాతలకు అవసరమైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను ప్రభుత్వమే సబ్సిడీపై అందిస్తోంది. ప్రక్రియలో భాగంగా యంత్ర పరికరాల మేళాలను ఏటా నిర్వహిస్తోంది. ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకుంటే వీటిని మేళా సమయంలో గ్రూపులకు అందజేస్తున్నారు. జిల్లాలో గతేడాది ఆగస్టులో నిర్వహించిన మొదటి మేళాలో 233, ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన రెండో మేళాలో 147 ట్రాక్టర్లను అందజేశారు.

ఎంతమంది వద్ద ఉన్నాయంటే..

పునర్విభజన అనంతరం నెల్లూరు జిల్లాలో తాజా జనాభా లెక్కల అంచనా మేరకు దాదాపు 32 లక్షల మంది నివసిస్తున్నారు. కుటుంబాలపరంగా చూస్తే దాదాపు 12 లక్షలు ఉన్నాయి. వీరిలో సుమారు 1.29 లక్షల కుటుంబాలు వ్యవసాయంలో ఉన్నాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఇందులో దాదాపు 18 వేల కుటుంబాలే సొంతంగా ట్రాక్టర్లు కలిగి ఉన్నాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారిలో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్న తరుణంలో వీరికి సబ్సిడీపై అందించేలా వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి చేయూతనిస్తోంది.

పరిణామ క్రమంలో మార్పులు

స్వాతంత్ర్యం రాక ముందు.. వచ్చాక కొన్నేళ్ల పాటు దేశంలో వ్యవసాయ రంగంలో పశువుల వినియోగం ఎక్కువగా ఉండేది. భూమికి ఎరువుగా పశువుల పేడను వాడేవారు. తొలకరి జల్లులు పడగానే పొలం దున్నడం నుంచి ప్రారంభిస్తే పంట ముగిసే వరకు పశువుల (ఎడ్లు / దున్నలు)తోనే పనులన్నీ సాగేవి. ప్రతి రైతింట పాడిపశువులు, ఎడ్లు తప్పనిసరిగా ఉండేవి. ఆ రోజుల్లో పశువుల సంఖ్య ఏ రైతు వద్ద ఎక్కువగా ఉంటే అతనికే సమాజంలో పరపతి ఉండేది. అయితే 1970 నుంచి వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం ప్రారంభమైంది. ఫలితంగా ట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో మార్కెట్లోకి వచ్చాయి.

సేద్యమే ఆధారంగా.. వ్యవసాయ కుటుంబాలు:	ట్రాక్టర్లు కలిగి ఉన్న రైతు కుటుంబాలు:
1.29 లక్షలు	18 వేలు

అందజేసిన ట్రాక్టర్లు..

మొదటి మేళాలో:	రెండో మేళాలో:
233	147

బ్యాంకుల రుణ సాయం

యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేయాలనుకునే రైతులు ఐదు లేదా ఆరుగురు ఒక గ్రూపుగా ఏర్పడాలి. వీరిని కస్టమ్ హైరింగ్ గ్రూపుగా పిలుస్తారు. ట్రాక్టరు ధరలో ప్రభుత్వం 40 శాతం వరకు సబ్సిడీ ఇస్తోంది. సభ్యులు 20 శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ రుణాన్ని గ్రూపు సభ్యులు విడతల వారీగా చెల్లించాలి. ఇలా చేయడం ద్వారా ఏ రైతుకూ భారం అనిపించదు. యంత్రం అవసరమైన వారి పొలంలో పనులు చేసి డబ్బు సంపాదించుకొని కిస్తీ సొమ్ము కట్టుకోవచ్చు.

యంత్ర సేవా పథకంతో పేద రైతులకు మేలు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ యంత్ర సేవా పథకం చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు చేస్తోంది. ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అవసరమైన వారు ఆర్బీకేల ద్వారా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఈసారి నిర్వహించనున్న యంత్ర మేళాలో ప్రాధాన్య క్రమంలో వారికి సబ్సిడీపై యంత్ర పరికరాలను అందజేస్తాం. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోంది.

– సుధాకర్‌రాజు, వ్యవసాయ శాఖ జేడీ, నెల్లూరు

కుటుంబ పోషణకు ఆధారం



ఐదేళ్ల క్రితం ట్రాక్టర్‌ను తీసుకున్నా. సొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ పంటల సాగులో ఖర్చులు దక్కించుకోగలుగుతున్నా. ఖాళీ సమయాల్లో రైతుల పొలాల్లో దుక్కి దున్నడంతో పాటు ఇతరత్రా బాడుగలతో కుటుంబపోషణకు ట్రాక్టర్ తోడ్పాటునిస్తోంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం పేద రైతులకు మేలు చేస్తోంది.

– రేవూరు జనార్దన్‌రెడ్డి, ట్రాక్టర్ యజమాని, డీసీపల్లి, మర్రిపాడు మండలం

ట్రాక్టర్‌తో రోజువారీ ఆదాయం



నాకున్న ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు, ట్రాలీ బాడుగలు చేస్తూ రోజు వారీ ఆదాయం పొందుతున్నా. రోజూ సగటున రూ.ఐదు వేల వరకు సంపాదిస్తున్నా. డీజిల్, ఇతరత్రా నిర్వహణ ఖర్చులు పోను కనీసం రూ.రెండు వేలు మిగులుతోంది. ట్రాక్టర్ ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు ఎంతో ఊరటనిస్తోంది.

– మద్దినేని సుబ్రహ్మణ్యం, ట్రాక్టర్ యజమాని, మహిమలూరు, ఆత్మకూరు మండలం

టీడీపీ అధికారంలోకి రాదు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సూర్యచంద్రులు తమ గతులు తప్పినా టీడీపీ అధికారంలోకి రాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో రూ.1.98 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, గ్రామ సచివాలయ భవనం, రైతుబజార్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. చంద్రబాబు చేసిన పాపాలే శాపాలై జైలు ఊచలు లెక్కబెడుతున్నారని విమర్శించారు. గత పాలకులు శిలాఫలకాలు వేసి పనులు చేయకుండా వెళ్లారని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలకు ఏమీ చేయలేకపోయాననే బాధ ఉండేదని చెప్పారు. ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లకు సరిపడా అభివృద్ధి పనులను పూర్తి చేశానని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారం.. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేయగలిగానని వెల్లడించారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి మండలంలో వెలకట్టలేని అభిమానులు, కుటుంబసభ్యులను ఇచ్చి వెళ్లారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ మంచి పని చేసినా, ప్రతిపక్ష టీడీపీ నేతలు రాళ్లు రువ్వుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు.

రైతుబజార్లతో ఎంతో మేలు

రైతుబజార్లతో ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి తెలిపారు. పొదలకూరు మార్కెట్లో రూ.73 లక్షలతో దుకాణాల నిర్మాణం, ఏఎంసీ చాంబర్ నిర్మాణానికి రూ.30 లక్షలు, వెంకటాచలంలో రూ.కోటిని యార్డు నిర్మాణానికి కేటాయించామని తెలిపారు. ముత్తుకూరులో చేపల మార్కెట్ నిర్మాణానికి రూ.50 లక్షలు, అనికేపల్లిలో చేపల మార్కెట్‌కు రూ.25 లక్షలను మంజూరు చేశామని వెల్లడించారు. తొలుత రైతుబజార్‌లో దుకాణాలను కేటాయిస్తూ నలుగురికి ఉత్తర్వులను అందజేశారు. రైతు బజార్ల సీఈఓ నందకిశోర్‌రెడ్డి, మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, ఏడీ అనితాకుమారి, ఏఎంసీ చైర్మన్ పెదమల్లు రత్నమ్మ, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు షాకీరాబేగం, లక్ష్మీకల్యాణి తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్‌లో దుకాణ కేటాయింపు ఉత్తర్వులను మహిళకు అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI DIGITAL MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరుకునే సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

శిబిరం చిరునామా:

అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్,
పోలీస్ గ్రౌండ్ ఎదురుగా, బ్రహ్మానందపురం, నెల్లూరు.
తేదీ : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9848997210

ప్రజలందరికీ ఆరోగ్య సురక్ష

ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రజలకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా అడుగులేస్తున్నారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే చేసి ప్రజలకు వైద్యసేవలందించేలా కార్యాచరణను రూపొందించారు. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా శుక్రవారం ప్రారంభించనున్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం
- రేపట్నుంచి ప్రారంభం
- ఇంటింటి సర్వే
- 30 నుంచి మెడికల్ క్యాంపులు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తాజాగా అమలు చేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల ప్రాంగణం లేదా అనువైన భవనాలు.. పట్టణాల్లో యూపీహెచ్‌సీల వద్ద శిబిరాలను నిర్వహించనున్నారు. విద్యార్థులతో పాటు రక్తహీనత ఉన్న బాలికలకు శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్‌ను నిర్వహిస్తారు. ప్రతి శిబిరం వద్ద ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులను ప్రభుత్వం కేటాయించింది.

బాధ్యతలు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు బాధ్యతను గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆయా పీహెచ్‌సీల వైద్యులు.. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ వైద్యులకు అప్పగించారు. మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను విభజించి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వైద్యుల సమన్వయంతో మెడికల్ క్యాంపులను నిర్వహించనున్నారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, వైద్యుల భాగస్వామ్యంతో శిబిరాలను జరపనున్నారు.

ఇదీ లక్ష్యం..

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేసి.. ఆరోగ్య సమస్యలు పరిష్కరించడం
- వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలోని ఇళ్లకెళ్లి ఏఎన్‌ఎంల సందర్శన షెడ్యూల్‌ను తెలియజేస్తారు
- ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తారు
- ఆరోగ్య వివరాలపై కేస్ షీట్‌తో పాటు టెస్టుల రిపోర్టులను వైద్యులకు అందుబాటులో ఉంచుతారు
- ఆరోగ్య శిబిరాల్లో రోగులను వైద్యులు పరీక్షించి మందులను అందజేయనున్నారు
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు.



జిల్లాలో విలేజ్ క్లినిక్‌లు	497
పీహెచ్‌సీలు	52
యూపీహెచ్‌సీలు	28
పీహెచ్‌సీల్లో డాక్టర్లు	120

పక్కా ప్రణాళికతో..



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాం. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులకు వైద్యసేవలందేలా చర్యలు చేపడుతున్నాం. కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి జిల్లాలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించనున్నాం. ఈ నెల 30 నుంచి గ్రామాలు, పట్టణాల్లో క్యాంపులను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తాం.

– హరినారాయణన్, కలెక్టర్

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి.. కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని.. వారి ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం వర్చువల్‌గా బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా కలెక్టర్లు కృషి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ మంచి ఫలితాలను సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ నెల 30న ప్రతి మండలంలో ఓ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలంలో నెల్లో కనీసం నాలుగు గ్రామాల్లో హెల్త్ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఈఓ గంగాభవాని, ఐటీడీఏ పీఓ మందా రాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తదితరులు హాజరయ్యారు.

ఎంపీతో మంత్రి భేటీ



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై వీరు చర్చించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

• కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం సాయంత్రానికి 13.118 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పిన్నేరువాగుకు పది క్యూసెక్కులు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లో లెవల్ స్లూయిజ్‌కు 50 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలం దేవరపాళెంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం సాయంత్రం ఎంపీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుముడి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎంపీ, జెడ్పీ, ఇతర నిధులను పనులకు కేటాయిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కొందరు టీడీపీ నేతలు అభివృద్ధి జరగడం లేదని మాట్లాడడం దారుణమన్నారు. అనంతరం నూతన పెన్షన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, దేవరపాళెం సర్పంచ్ వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పూర్తి విచారణ తర్వాతే బాబు అరెస్ట్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసును పూర్తిగా విచారించిన తర్వాతే చంద్రబాబును అరెస్ట్ చేశారని ఎంపీ ఆదాల అన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాజకీయ కక్షకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం దారుణమన్నారు. అంతటి అవసరం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. నెల్లూరు మేయర్ స్రవంతి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

స్కిల్ స్కామ్ దర్శకుడు చంద్రబాబే..



• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు దర్శకత్వం వహించింది చంద్రబాబు నాయుడే. తప్పు చేసి దొరికిపోయాడు కాబట్టి శిక్ష అనుభవించాల్సిందే..' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సొమ్మును లూటీ చేసిన చంద్రబాబుకు మద్దతుగా నిలిచిన వారిని ప్రజలు క్షమించరన్నారు. కేసులో బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందునే ఆయన్ను అరెస్ట్ చేశారని తెలిపారు. తీగ లాగితే డొంక కదిలిందని, చేసిన నేరానికి సిగ్గుతో తల దించుకోవాల్సింది పోయి రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా నారా లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ వ్యవహరించారన్నారు. టీడీపీ అధినేతకు మద్దతు ఇస్తున్న వ్యక్తులు, రాజకీయ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ప్రజల సొమ్ము దోచుకున్న వారికి అండగా నిలుస్తాం.. అవినీతికి పాల్పడడమే మా విధానమని చెప్పగలరా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులు ప్రజల ముందు మాట్లాడే అర్హత కోల్పోయారన్నారు. ప్యాకేజీ కోసం పార్టీ విధానాలను సైతం తాకట్టు పెట్టేసే వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. బాబు స్కామ్‌లు చేస్తుంటే రామోజీరావు, ఎల్లో మీడియా పెద్దలు అండగా ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం జిల్లాలో పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో గుర్తించిన, పెండింగ్‌లో ఉన్న అన్ని ఓటరు అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామన్నారు. సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు తప్పులకు తావులేని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా రేషనలైజేషన్ ప్రక్రియపై సూచనలు ఉంటే వెంటనే అందజేయాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులను సూచించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో బాగా జరుగుతోందని పార్టీల ప్రతినిధులు ప్రశంసించారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నుంచి మందల వెంకటశేషయ్య, టీడీపీ నుంచి భువనేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రాణాలపైకి తెచ్చిన ఆకతాయితనం

• హైటెన్షన్ వైర్లు తగిలి యువకుడికి తీవ్రగాయాలు

కావలి: ఓ యువకుడు చేసిన ఆకతాయి పని అతడి ప్రాణాల మీదకు తెచ్చింది. హైటెన్షన్ వైర్లు తగిలి అతను తీవ్రంగా గాయపడిన ఘటన కావలి రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం బుడంగుంట కాలనీకి చెందిన పాలకీర్తి అఖిల్ అనే యువకుడు చదువుకుంటున్నాడు. ఆకతాయితనంతో కావలి రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉన్న గూడ్స్ రైలు పైకి ఎక్కుతుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి చర్మం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



తీవ్రంగా గాయపడిన అఖిల్

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన ఆత్మకూరు క్రీడాకారులతో నిర్వాహకులు

ఆత్మకూరు: జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆత్మకూరుకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. హరియాణా రాష్ట్రం రోహతక్‌లో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ గ్రాప్లింగ్ కుస్తీ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న ఆత్మకూరుకు చెందిన ఓం శ్రీనైన, ఎ.వెంకటకోటేశ్వరరావు, ఎస్.విజయవర్ధన్, ఎస్.విమలేష్, ఎన్.భవదీప్, ఎస్‌కే మహమ్మద్ ఫజిల్, కె.లోకేశ్‌లు ప్రతిభ చూపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన ఆత్మకూరు కోచ్ వి.రాంబాబు, నెల్లూరు జిల్లా కోచ్ ప్రేమ్‌కుమార్, విద్యార్థులను పలువురు బుధవారం అభినందించారు.

కారు డ్రైవర్ అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ఊపిరాడకో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ ఓ బార్‌లోని బాత్‌రూంలో కారుడ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన కె.జయచంద్రకుమార్ (33), శశికళలు దంపతులు. జయచంద్ర కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఆయన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగాడు. బార్ మూసివేయడంతో అక్కడున్న బాత్‌రూంలోకి వెళ్లాడు. మద్యం మత్తులో ఊపిరాడకో?, లేక మరో కారణమో తెలియదు కానీ మృతిచెందాడు. కొద్దిసేపటి అనంతరం ఈ విషయాన్ని గమనించిన బార్‌లోని సిబ్బంది అతడి వివరాలు సేకరించారు. శశికళకు బుధవారం తెల్లవారుజామున సమాచారం అందించారు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తరలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

• ఒకరి మృతి



నాగేశ్వరరావు మృతదేహం



పంట కాలువలో పడిపోయిన ఆటో

కావలి: తిరుమలకు బయలుదేరిన వ్యక్తులకు చెందిన ఆటోను లారీ ఢీకొన్న ఘటన బుధవారం కావలి మండలం ముసునూరు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ప్రాంతానికి చెందిన వంటమనిషి ఆర్జీ నాగేశ్వరరావు (59) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ సహా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాజానగరం మండలం నరేంద్రపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు ఆదివారం తిరుమల యాత్రకు సైకిళ్లపై బయలుదేరారు. వీరికి అవసరమైన భోజనం తయారు చేసేందుకు అవసరమైన సరుకులతో ఆరుగురు వ్యక్తులు ఆటోలో బయలుదేరారు. ముసునూరు సమీపంలోకి వచ్చేసరికి ఆటో ప్రమాదానికి గురైంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ ఆటోను వెనుక వైపు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కనే ఉన్న పంటకాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నాగేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ చౌటుపల్లి శ్రీను, ఇంకా ఉల్లి విష్ణుమూర్తి, మారెడ్డి రాంబాబు, తర్రా శీను, గుత్తల రాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తొలుత కావలి ఏరియా వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 145
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 276
లేయర్ చికెన్	: 192

